క్లుప్తంగా

ఆదోనివాసికి ఉత్తమ సామాజిక సేవా అవార్డు


విరుపాక్షికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్ : పట్టణంలో ఎంతోమందికి రక్త దానం చేసిన జనసేవ స్వచ్ఛంద సేవా వ్యవస్థాపక కార్యదర్శి విరుపాక్షికి జనవిజ్ఞాన వేదిక వారు రాష్ట్రస్థాయి ఉత్తమసేవా అవార్డును అందజేశారు. అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలో శాస్త్ర కళాశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో విరుపాక్షికి అవార్డు అందించారు. సినీ గేయ రచయిత జయరాజు, వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్ అవార్డును అందజేశారు.

శ్రీమఠంలో పులివెందుల డీఎస్పీ


రాఘవేంద్రుల సన్నిధిలో డీఎస్పీ వినోద్ కుమార్

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం వైఎస్సార్ జిల్లా పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం దర్శించుకుని పూజలు చేసుకున్నారు. స్థానిక సీఐ శ్రీనివాసులు, శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ తదితరులు ఉన్నారు.

దుబాయ్‌లో గుండెపోటుతో ఆదోనివాసి మృతి


మహబూబ్‌బాషా (ఫైల్)

ఆదోనిఅర్బన్: పట్టణంలోని నాల్‌బంద మొహల్లా కాలనీకి చెందిన మహబూబ్‌బాషా(44) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. మహబూబ్‌బాషా 12 సంవత్సరాల క్రితం దుబాయ్‌లోని ఓ కంపెనీలో నందు ఉద్యోగం చేస్తున్నాడని ఆయన సోదరుడు గౌస్ తెలిపారు. శనివారం హఠాత్తుగా దుబాయ్‌లో గుండెపోటు రావడంతో మృతి చెందాడని, మృతదేహాన్ని ఆదోనికి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఆదోనిలో శనివారం అంత్యక్రియలు జరుపుతామని పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థిని

కోసిగి: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతోందని జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బందే నవాజ్ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని పీడీ రామచంద్ర ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు జరిపించారు. ఇందులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ఆవరణలో శనివారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఫయాజ్ అహ్మద్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం జెండా ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, మండల కార్యదర్శి కల్లుబావి రాజు , ఎస్. షబీర్ బాషా పాల్గొన్నారు.

కోలుకోలేక రైతు మృతి

ఆస్పరి: అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రైతు కోలుకోలేక శనివారం మృతిచెందాడు. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు.. మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న (46) పంటల సాగుకు రూ.8 లక్షలు దాకా అప్పు చేశాడు. వాటిని తీర్చేదారి లేక ఈనెల 9న పురుగు మందు తాగాడు.

సాధికారత.. సంక్షేమ బావుటా

- ● డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ వరం
- ● స్వయం సంఘాలకు సున్నా వడ్డీ వర్తింపు
- ● మంత్రాలయం నియోజకవర్గంలో 5,094 గ్రూపులకు రూ.5.27 కోట్లు విడుదల

పేద అక్కచెల్లెమ్మలకు సాధికారత కల్పించేలా, వారి వ్యాపారాలు వృద్ధి చెందేందుకు సున్నా వడ్డీతో రుణాలు అందజేసి, వారి అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది. వరుసగా నాలుగో ఏడాది స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీని శుక్రవారం వారి బ్యాంక్ ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. రుణాలు సక్రమంగా చెల్లించిన సంఘాల్లోని మహిళలకు వడ్డీ భారం కాకూడదని ప్రభుత్వం వారి ఖాతాల్లో వడ్డీ సొమ్ము జమ చేసింది.


కోసిగి స్త్రీ శక్తి భవన్లో సీఎం జగనన్న ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న పొదుపు మహిళలు (ఫైల్)


మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి (ఫైల్)

మండలాల వారీగా సున్నా వడ్డీ లబ్ధి పొందిన స్వయం సహాయ సంఘాల వివరాలు..

మండలం	గ్రూపులు	సున్నా వడ్డీ మొత్తం
కోసిగి	1,316	రూ.1.24కోట్లు.
కౌతాళం	1,399	రూ.1.52కోట్లు
పెద్దకడబూరు	1,177	రూ.1.29కోట్లు
మంత్రాలయం	1,202	రూ.1.21కోట్లు
మొత్తం	5,094	రూ.5.27కోట్లు

కోసిగి: అక్కా చెల్లెమ్మల ఆర్థిక స్వాలంబనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదుపు మహిళలకు పెద్ద పీట వేశారు. మహిళల అభ్యున్నతికి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ వర్తింపజేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంక్ లింకేజీ ద్వారా భారీ ఎత్తున బ్యాంక్ రుణాలు అందజేశారు. అలాగే బ్యాంక్‌లో తీసుకున్న రుణాల వడ్డీలు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో పొదుపు మహిళలు బ్యాంక్‌లకు కట్టిన వడ్డీ రుణాలు ఏటా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ తరుణంలో నాలుగో విడత సున్నా వడ్డీకి సంబంధించిన మొత్తాన్ని శుక్రవారం కోనసీమ జిల్లాలో బటన్ నొక్కి మహిళ ఖాతాల్లో జమ చేశారు. మంత్రాలయం నియోజకవర్గంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 5,094 గ్రూపులకు రూ.5.27కోట్లు విడుదల చేశారు.

వైఎస్సార్ సున్నా వడ్డీ వర్తింపు ఇలా..: బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాలు వాటిని వాయిదా రూపంలో సక్రమంగా చెల్లించి సంఘాలకు మాత్రమే వైఎస్సార్ సున్నా వడ్డీ వర్తిస్తుంది. సంఘాల తీసుకున్న అప్పు తేదీ, రుణం మొత్తం, పొదుపు ఖాతాల నంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తదితర వివరాలను మండల స్థాయిలో అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ వివరాల ఆధారంగా పొదుపు మహిళలకు ప్రభుత్వం సున్నా వడ్డీ వర్తింపజేస్తుంది.

మాట తప్పని నేత జగన్



పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తోడ్పాటు అందిస్తున్నాడు. మహిళల సంక్షేమ కోసం అమలు చేసిన పథకాలు మరువలేనివి. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, స్త్రీ నిధి, వైఎస్సార్ చేయూత, జగన్న తోడు వంటివివ అమలు చేస్తూ మా అభ్యున్నతికి కృషి చేస్తున్నాడు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చి మాట తప్పని నేతగా నిరూపించుకున్నారు.

– పార్వతి, కోసిగి

మా అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు



కోసిగిలో తిమ్మప్ప పొదుపు లక్ష్మి గ్రూపులో సభ్యురాలిగా 20 ఏళ్లుగా ఉంటున్నా. గత ప్రభుత్వం మాకు చేసిందేమీ లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా కింద రుణమాఫీ చేశారు. బ్యాంక్‌లో తీసుకున్న రూ.5లక్షలకు సున్నా వడ్డీ వర్తింపజేశాడు. వైఎస్సార్ చేయూత అందుతోంది. మహిళల కోసం ఎంతో తోడ్పాటును అందిస్తున్నాడు.

– ఉరుకుందమ్మ, కోసిగి

జీవనోపాధికి మెరుగైన కృషి



రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తోంది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేశాం. ఇందులో మహిళలు స్వయం పోషణ చేసుకుని కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. అలాగే బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీని తిరిగి చెల్లించింది. ఈ పథకాలు పొదుపు మహిళ అభ్యున్నతికి ఎంతగానో ఉపయోగపడతాయి.

– సత్యమ్మ, ఏపీఎం, కోసిగి

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


టెంకాయల వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు

కౌతాళం: శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో టెంకాయలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి హెచ్చరించారు. శనివారం దేవాలయ కార్యాలయంలో టెంకాయల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భక్తులకు టెంకాయలు మాత్రమే ఇవ్వాలని ఇతర సామగ్రి కట్టబెట్టి అధికంగా డబ్బులు వసూలు చేయకూడదన్నారు. భక్తులు అడిగితేనే వారికి బియ్యం, బ్యాళ్లు, కుంకుమ, విబూతి ఇవ్వాలని, వారు అడగకుండానే సామగ్రిని అంటగట్టారని ఫిర్యాదు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. వ్యాపారులు ఆలయ అధికారుల, పోలీసుల సూచనలను పాటించాలన్నారు. సమావేశంలో ఆలయ సిబ్బంది, ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి పాల్గొన్నారు.

రూ.7.40 కోట్లతో జగనన్న కాలనీకి బీటీ రోడ్డు


జరుగుతున్న రహదారి పనులు

ఆదోని సెంట్రల్: పట్టణ సమీపంలోనున్న జగనన్న కాలనీకి వెళ్లే రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.40 కోట్లు మంజూరు చేసింది. కాలనీకి వెళ్లడానికి లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. పట్టణంలో ఈహెచ్‌ఎస్ దగ్గర ఉన్న రైల్వే ట్రాక్ నుంచి జగనన్న కాలనీ మీదుగా ధణాపురం గ్రామానికి నేరుగా వెళ్లేలా పనులు జరుగుతున్నాయి. రెండు పెద్ద కల్వర్టులతో 5.50 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపట్టారు. ఢణాపురం గ్రామం వద్ద 300 మీటర్లు సీసీ రోడ్డు వేయనున్నారు. జగనన్న కాలనీలో దాదపు 11 వేల ప్లాట్లు ఉన్నాయి. కాలనీకి సమీపంలో ఆటోనగర్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నారు. ఢణాపురం గ్రామానికి చెందిన వారు వివిధ పనులపై పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామానికి వెళ్లడానికి దగ్గరువుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జగనన్న కాలనీలో తాగునీరు, అంతర్గత రహదారులు, విద్యుత్తు లైన్లు వంటి పనులు జరుగుతున్నాయి. కాగా రోడ్డు నిర్మాణానికి అడపా దడప కురుస్తున్న వర్షాలతో అంతరాయం కలుగుతోందని పంచాయతీరాజ్ ఇంజినీరు ఖాదర్ బాషా తెలిపారు. ప్రస్తుతం చిన్న కంకంర వేసి రోలర్ తిప్పుతున్నామని, త్వరలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. అగసలదిన్నె గ్రామంలో, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలను చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలను జరిపించారు. కౌతాళంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

అమరవీరుల సేవలు మరువలేనివి


హనుమాపురంలో శిలాఫలకం ఏర్పాటు చేసిన దృశ్యం

కోసిగి: దేశ సేవలో అమర వీరుల త్యాగాలు మరువలేనివని ఐరన్‌గల్లు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మన్న రావు పేర్కొన్నారు. శనివారం ఐరన్‌గల్లు ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో నాదేశం– నాభూమి కార్యక్రమం నిర్వహించారు. అమర జవానుల గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించి మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఫీల్డ్ అసిస్టెంట్ సురేంద్ర పాల్గొన్నారు.

కౌతాళం: నాభూమి–నాదేశం కార్యక్రమానికి అందరూ కట్టుబడి ఉండాలని బాపురం గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు జైపాల్, శ్రీనివాసరెడ్డి, అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయం: పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామంలో నా భూమి – నా దేశం కార్యక్రమం చేపట్టారు. శనివారం పాఠశాల ఆవరణలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి సమక్షంలో గ్రామ ఏంపీయూపీ పాఠశాలలో అమరవీరులకు జోహార్లు పలికి అంజలి ఘటించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, నాయకులు జాము మూకయ్య, గజేంద్రరెడ్డి, ఈరన్న, దొడ్డిమేకల సర్పంచు చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ రామన్న పాల్గొన్నారు.

మంత్రి సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

- ● దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు


పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు

హొళగుంద: మంత్రి గుమ్మనూరు జయరాం స్వంత నిధులతో మార్లమడికి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నట్లు ఆయన సోదరుడు, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు తెలిపారు. గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన మార్లమడికి రోడ్డు మరమ్మతు పనులను శనివారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. 5 కి.మీ ఈ రోడ్డు డబుల్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా కార్యరూపం దాల్చడంలో ఆలస్యమైందన్నారు. మరో పక్క రోడ్డు అధ్వానంగా ఉండటంతో కర్ణాటక ఆర్టీసీ వారు బస్సు సర్వీసులను నిలిపేశారన్నారు. దీంతో మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని మంత్రి గుమ్మనూరు జయరాం తన స్వంత ఖర్చుతో మరమ్మతులు చేయించేందుకు ఉపక్రమించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, సింగిల్ విండో ఛైర్మన్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలి

ఆదోని సెంట్రల్: ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఢణాపురం ఉదయ్ తెలిపారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, ప్రభుత్వాలు వెంటనే భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. అరుణ్‌కుమార్ రెడ్డి,కృష్ణ, వీరభద్ర, కేశవ సుకుమార్ పాల్గొన్నారు.

దోమలపై గంబూజియాస్త్రం!

- ● నీటి కుంటలు, చెరువుల్లో గంబూషియా చేపల విడుదల
- ● ఒక్కో చేప రోజుకు వంద లార్వాలకు ఫైగా స్వాహా
- ● తద్వారా దోమల నియంత్రణ
- ● మలేరియా, డెంగీ వ్యాధుల నివారణ
- ● జిల్లా వ్యాప్తంగా లక్ష చేపలకు ఫైగా విడుదల
- ● ఈ ఏడాది కూడా లక్ష దాకా చేపల పంపిణీ


చెరువులు, బావులు, కుంటలలో చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది


గంబూషియా చేప

కర్నూలు(హాస్పిటల్): దోమలు పుట్టకూడదు...దోమలు కుట్టకూడదు ఇది ప్రభుత్వ నినాదం. దోమలు కుట్టకుండా ఇప్పటికే చర్యలు చేపట్టిన అధికారులు తాజాగా అవి పుట్టకుండా గుడ్డు దశలోనే అంతమొందించేందుకు గంబూజియాస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. ఒకవైపు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తూ మరోవైపు చెరువులు, నీటి కుంటల్లో లార్వాలు పెరిగి పెద్దవి గాకుండా వాటిని తినేందుకు అందులో గంబూషియా చేపలను వదులుతున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం విస్తృతంగా సాగుతోంది.

వర్షాకాలం సీజన్‌లో ఎక్కడికక్కడ వాగులు, వంకలు పొర్లడం అలా పారిన నీరు కుంటలు, చెరువుల్లో, పెద్ద పెద్ద ఖాళీ స్థలాల్లో నిల్వ ఉండటం సహజం. వారానికి మించి ఇలా నీరు నిల్వ ఉంటే చాలు దోమలకు గుడ్లు పెట్టేందుకు ఆవాసాలవుతాయి. అందులో మంచినీళ్లు నిల్వ ఉంచే ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌లు అయితే డెంగీ కారక ఏడిస్ ఈజిప్టై దోమలు సులభంగా పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇలాంటి వాటిలో దోమలు పెట్టిన గుడ్ల(లార్వా)లను నాశనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని మలేరియా విభాగం విస్తృత చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఒకవైపు ఇంటింటికీ తిరిగి మంచినీటి నిల్వలను పరిశీలించి అందులో లార్వాలు ఉంటే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పారబోయించి శుభ్రం చేస్తున్నారు. మరోవైపు నీటి నిల్వ కుంటలు, చెరువులు, తటాకాలు, ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో గంబూషియా చేపలను వదులుతున్నారు. దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు వ్యాధులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.


దోమల గుడ్లపై చేపలతో దాడి

డెంగీ, మలేరియా కారక దోమలను అంతమొందించేందుకు మలేరియా విభాగం ఆధ్వర్యంలో చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గంబూషియా చేపలను మత్స్యశాఖ నుంచి సేకరించారు. వర్షాకాలం వస్తోందంటే చాలు మత్స్యశాఖ వారు ముందుగానే గంబూషియా చేపలను ప్రత్యేకంగా మంచి నీటి వసతుల్లో పెంచుతారు. మలేరియా విభాగం డిమాండ్ మేరకు అవసరమైన చేపలను వారు సరఫరా చేస్తారు. గతేడాది కర్నూలు జిల్లాలో లక్ష చేపల వరకు సరఫరా చేయగా ఈ ఏడాది మొదటి విడతగా ఇప్పటికే 15వేల చేపలను పంపిణీ చేశారు. వీటిని రెండు రోజుల క్రితం అమడగుంట్ల, పోలకల్, గార్గేయపురం, బి.తాండ్రపాడు, కేతవరం, కర్నూలు పట్టణం, గుడిపాడులలోని నీటి కుంటలలో అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, ఎస్‌యూఐ కృష్ణమోహన్, ఎంపీహెచ్‌ఈఓ వెంకటరమణ, ఎంపీహెచ్‌ఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు కలిసి వదిలారు. వీటితో పాటు మరో 80 వేల దాకా చేపలు కావాలని అధికారులు కోరారు.

సైజు చిన్నది–జీవితకాలం పెద్దది

గంబూషియా చేపల జీవితకాలం 4 నుంచి ఐదేళ్లు. ఇవి స్వచ్ఛమైన నీరు ఉండే స్విమ్మింగ్‌పూల్స్, మంచి నీటి చెరువులు, బావులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌లలోనే పెరుగుతాయి. ఆ నీటిలోని దోమల లార్వాలను, పీచును తిని ఇవి జీవిస్తాయి. ఆడ చేప 5.2 నుంచి 6.8 సెం.మీ వరకు ఉండగా మగ చేప 4.5 సెం.మీ వరకు ఎదుగుతుంది. ఒక్కో చేప రోజుకు 100 నుంచి 180 దోమల లార్వాలను తినేస్తుంది. ఈ చేపలు విడతకు 20 నుంచి 30 పిల్లలకు(ఇవి గుడ్లు పెట్టవు) జన్మనిస్తాయి. తమ జీవితకాలంలో ఒక్కో చేప 900 నుంచి 1200ల పిల్లలకు జన్మనిస్తుంది.

గంబూషియా చేపలతో దోమల నియంత్రణ



గంబూషియా చేపల ద్వారా దోమలను నియంత్రించవచ్చు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో డెంగీ, మలేరియా కారక దోమల నియంత్రణకు గాను గంబూషియా చేపలను నిల్వ ఉన్న నీటిలో వదులుతుంటాము. దోమల లార్వాలను చేపలు తినడం వల్ల దోమల సంతతి బాగా తగ్గుతోంది. ఇలాంటి చర్యలతో మలేరియా కేసులు తగ్గాయి. ప్రజలు సైతం ఇంట్లో మంచి నీటి నిల్వలు లేకుండా కనీసం వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకోవాలి. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

చిన్నతుంబళం సొసైటీకి ఉత్తమ అవార్డు



మంత్రి కాకాని గోవర్ధన్ నుంచి ప్రశంశ పత్రాలు అందుకుంటున్న సొసైటీ నిర్వాహకులు

మంత్రాలయం : రైతులకు ఉత్తమ సేవలు అందించిన పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామ ప్రాథమిక సహకార సంఘానికి ఉత్తమ అవార్డు లభించింది. రైతు సేవల్లో జిల్లాలో రెండవ స్థానంలో నిలిచింది. ఇటీవల విజయవాడ ఏ–కన్వెషన్ హాల్‌లో జరిగిన సహకార సంఘాల వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం చిన్నతుంబళం సింగిల్ విండో నిర్వాహకులు అవార్డు అందుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్, ఆప్కాబ్ అధ్యక్షురాలు ఝాన్సీ నుంచి సింగిల్ విండో ప్రెసిడెంట్ మణిగార్ రవీంద్ర, సొసైటీ నరసింహమూర్తి అవార్డు అందుకున్నారు. ప్రశంశా పత్రంతోపాటు జ్ఞాపిక, రూ.40 వేలు రివార్డు పొందారు.

కొనసాగుతున్న ఓటరు పరిశీలన

మంత్రాలయం : నియోజకవర్గంలో ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆర్బీకే ఏవో రమాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ షబానా నేతృత్వంలోఓటరు నమోదు నిర్వహించారు. బూత్ కమిటీ కన్వీనర్ యల్లప్ప, సర్పంచు లింగన్నగౌడ్, తలారి బసన్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతిచెందిన పల్లవి


ఆదోనిరూరల్: మండలంలోని మదిరె గ్రామంలో పల్లవి (22) అనే వివాహిత శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిందని ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. హొళగుంద మండలం వందవాగిలికి చెందిన పల్లవిని ఆదోని మండలం మదిరె గ్రామానికి చెందిన జయరామ్ పెద్దకుమారుడు ధనుంజయకు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటూ జీవనం గడుపుతున్నారు. ఒకసారి పల్లవికి అబార్షన్ జరిగింది. ప్రస్తుతం పల్లవి నాలుగు నెలల గర్భిణి. శుక్రవారం రాత్రి తన తల్లి లక్ష్మితో ఫోన్‌లో మాట్లాడింది. రాత్రి భార్యాభర్తలు ఇంట్లో పడుకొని ఉండగా, తెల్లవారుజామున ఎంతసేపటికీ పల్లవి లేకపోవడంతో భర్త ధనుంజయ లేపేందుకు ప్రయత్నించగా లేవకపోవడంతో తల్లిదండ్రులను పిలిచి విషయాన్ని చెప్పగా, చికిత్స నిమిత్తం ఆమెను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని, తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మంత్రాలయంలో ప్రముఖ దర్శకుడు సుకుమార్


కల్లుదేవకుంట గ్రామ యువకులతో దర్శకుడు సుకుమార్

మంత్రాలయం : తెలుగు చిత్రసీమ ప్రముఖ దర్శకుడు, పుష్ప సినిమా డైరెక్టర్ సుకుమార్ శనివారం మంత్రాలయం విచ్చేశారు. మండలంలోని కల్లుదేవకుంట గ్రామానికి చెందిన సినీ రచయిత వేమారెడ్డి తండ్రి తిమ్మారెడ్డి అనారోగ్యంతో మంచం పట్టారు. ఆయనను పరామర్శించేందుకు సుకుమార్ శనివారం ఇక్కడికి వచ్చారు. వేమారెడ్డి నాన్న ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సుకుమార్ దర్శకత్వం వహించిన ఆర్య, ఆర్య–2 తదితర చిత్రాలకు వేమారెడ్డి రచన చేశారు. సుకుమార్‌తో ఫొటోలు దిగేందుకు గ్రామ యువకులు ఆసక్తి చూపారు.

దంపతులపై దాడి


చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

కోసిగి: మండలంలోని నేలకోసిగి గ్రామానికి చెందిన ఉశేనమ్మ, చిన్న సక్కీరయ్య దంపతులను జంపాపురం గ్రామానికి చెందిన కుంటి బసప్ప ఆయన కుమారులతో కలసి దాడి చేసి గాయపరిచారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. నేలకోసిగి గ్రామానికి చెందిన చిన్న సక్కీరయ్య కుమారుడు వీరారెడ్డికి జంపాపురం గ్రామానికి చెందిన కుంటి బసప్ప కుమార్తె విజయలక్ష్మితో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి 9నెలల క్రితం కుమారుడు జన్మించారు. అయితే మనవడిని చూసి తమ కోడలిని ఇంటికి తీసుకెళ్లాలని జంపాపురం గ్రామానికి వెళ్లారు. అయితే కుటుంబ కలహాలు, పాత కక్షలను మనస్సులో పెట్టుకుని కుంటి బసప్పతో పాటు కుమారులు ఆ ఇద్దరు దంపతులు, వీరారెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. ఉశేనమ్మ, చిన్న సక్కీరప్పకు తీవ్ర గాయాలు కావడంతో కోసిగి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.